# పేరుకు మాత్రం 'అన్నా'జీ!

మధ్వశ్రీ పీల్‌ఖానా అన్నాజీరావు పంతులు 1907వ సంవత్సరం ఆగస్టు 15 వ తేదీన అమలాపురంలో జన్మించారు.

ఉన్నత విద్యను రాజమహేంద్రవరమునందు గడించే కాలంలోనే శ్రీపాద కృష్ణమూర్తిశాస్త్రిగారి 'వజ్రాయుధం' పత్రికలోను, సుబ్రహ్మణ్యశాస్త్రిగారి 'ప్రబుద్ధాంధ్ర'లోను, ఆంధ్ర సాహిత్య పరిషత్పత్రికలోను, ఆంధ్రపత్రిక సారస్వతానుబంధములోను వీరి రచనలు ప్రకటించేవారు.

పండిత పట్టము నందుకొన్న తర్వాత చెళ్ళపిళ్ళగారి పదముల నాశ్రయించి, శాస్త్రాధ్యయనం చేయడమే కాక, అవధాన ప్రక్రియారహస్యములు కూడా నాకళించుకొని, 1929 లో రాజమహేంద్రవరంలో 'మెట్కాఫ్ హాస్టలు' వార్షికోత్సవ సందర్భంలో తమ తొలి అష్టావధానమును.మరు సంవత్సరమే శతావధానాన్ని నిర్వహించారు.

## గ్రంథ రచనం

వేదుల సత్యనారాయణశాస్త్రిగారి సాహచర్యంతో కవితలో మార్దవాన్ని అలవరచుకొని, వారికే తన తొలి గ్రంథం 'కుసుమాంజలి' అను ఖండకావ్య సంపుటాన్ని అంకితం చేశారు. ఈ ఊపులోనే మార్జహోను, రాణీ సంయుక్త మొదలైన చారిత్రక నాటకాలను, సుభద్రా పరిణయము, పార్వతీ కల్యాణము మొదలైన పౌరాణిక నాటకాలను రచించి చిలకమర్తి లక్ష్మీనరసింహంగారి ప్రశంసల నందుకొన్నారు.

## మదరాసు జీవితం

ఆంధ్రపత్రిక సంపాదకవర్గంలో పనిచేసి, ఆ తర్వాత భారతి మాసపత్రికలో, ఆ పిమ్మట శ్రీ గంటి సూర్యనారాయణశాస్త్రి స్థాపించిన 'శృంగార గ్రంథమాల' ప్రచురణలకు మద్రాసు ప్రాచ్యలిఖిత పుస్తక భాండాగారమునకు పోయి, శిథిలావస్థలో వున్న శృంగార గ్రంథములకు మేలుప్రతులు సమకూర్చి ప్రచురణకు తోడ్పడ్డారు. ఆ పిమ్మట అధ్యాపక వృత్తిపై మనమ్ము మళ్లి ఉభయ గోదావరి మండలాలలో ప్రాచ్య భాషా కళాశాలలలో పదిహేడు సంవత్సరాలు పనిచేశారు.

## కవితాయాత్ర

కలకత్తా, బొంబాయి, ఢిల్లీ, మద్రాసు, ఆంధ్ర సంఘాల ఆధ్వర్యంలో 1960 నుంచి 1979 వరకు అవధానాలు, ఉపన్యాసాలు చేసి జటప్రోలు, గద్వాల, పిఠాపురం, ఉర్లాం సంస్థానాధీశుల సన్మానాలందు కొన్నారు. జయపురం సంస్థానంలో నవరాత్ర్యుత్సవాలకు ఏటా వీరి నాహ్వానించి, సన్మానించేవారు. శ్రీ బూర్గుల రామకృష్ణారావు ప్రభుత్వ పక్షాన వీరిని సత్కరించారు.

## కోనసీమ కోకిల

1967 వ సంవత్సరంలో వీరుషష్టిపూర్తిఉత్సవాన్ని వైదికంగా జరుపుకొన్నారు. తర్వాత మూడు మాసాలలో రాయలసీమలో నాలుగు జిల్లాలు పర్యటించారు. సాహిత్య సంఘము లేర్పాటుచేసిన సభలలో ఉపన్యసించారు. కడపలో పద్మశ్రీ పుట్టపర్తివారు వీరిని 'కోనసీమ కోకిల'గా అభివర్ణించారు.

## వేంకటేశ్వర సన్నిధి

1980 లో సప్తగిరి మాసపత్రికసంపాదకవర్గములో చేరి 10-10-80 నుండి 20-4-86 వరకూ స్వామి సాన్నిధ్యముననే వుండి, శ్రీనివాస కల్యాణము, శ్రీనివాస వైభవము, కళ్యాణ చక్రవర్తి మున్నగు కావ్యరచనలుచేసి, దృష్టిమాంద్యము కలుగుటచే పదవీ విరమణ చేశారు. వీరికి రూల్సు ప్రకారము పెన్షన్, బోనస్, గ్రాట్యుటీ సౌకర్యములు లేవు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వీరిని ఉగాది కవి సమ్మేళనానికి ఇటీవల ఆహ్వానించి సత్కరించింది. చిర కాలం సాహిత్య పరిశ్రమ చేసి, తన జీవితాన్ని సాహిత్యానికే అంకితం చేసిన 'అన్నాజీ' వేదన్నార్తుడై, దృష్టి మాంద్యముచే కుములుతూ, బంధువుల ఇంట కాలక్షేపం చేస్తున్నారు.

యావజ్జీవ భృతిని ప్రభుత్వము ఏర్పాటు చేసినగాని తనకు జీవనము జరుగదను విచారముతో వున్నారు.

"అన్నాజీ యనపండితుండు, కవియు, న్నత్యంతమే భక్తిం
పన్నుండున్, మఱి స్నేహ పాత్రుడునున్, వార్ధక్య పర్యంతమున్
ఎన్నో చేసెను వేంకటేశ్వరుడ!! తహేరాళ సేవల్, కడున్
అన్నార్తుండయి, నేడు వీథి బడు టాహా! ఖేదముం గూర్చెడిన్

పైడిపాటి సుబ్బరామశాస్త్రి

"చెప్పు తీసుకుంటా" గట్టిగా అరిచాడు ఓబులేశు.

ఎదురుగా నేలమీద పడున్న సీత వెక్కిళ్లు పెడుతూ నేలకేసి చూస్తోంది.

"అసలేమిటే నీ... నీకింత పొగరేడ నుంచి వచ్చిందే దొంగముండ. నేనేమన్నా నీ అందం జూసి నిన్ను పెళ్లాడాననుకున్నావా? అసలు నిన్నూ, నీ అబ్బనీ చేర్చి నరికినా పాపం లేదే? ముప్పొద్దులా నీకు తేరగా తిండి పడేయడానికి నా దగ్గర పైసలు ఇచ్చే చెట్లేమీ లేవు."

## కాలమ్ దాటని కథ

సీత- అంటే ఓబులేశు భార్య మాత్రం తల వంచుకుని ఏడుస్తూనేవుంది. "అసలు నీదీ ఓ బ్రతుకేనా? ఇన్ని మాటలంటున్నా నీకు సిగ్గు రాదా? నేనేమన్నా చెవిలో పువ్వు పెట్టుకున్న అమాయక చక్రవర్తిలా కనబడుతున్నానా నీకు."

తన మాటలు వినడం లేదని నిర్ణయించుకున్న ఓబులేశు మరీ రెచ్చిపోయి సీత జుట్టు పట్టుకుని మెడను తన వైపుకు తిప్పి "ఒసేవ్! రాక్షసీ కట్నంగా తేవాల్సిన ఆ పది వేలు ఎప్పుడే తెస్తావ్?" అరిచాడు గొంతు పెంచి.

ఒక్కసారిగా పొంగుకొచ్చిన దుఃఖాన్ని ఆపుకోలేక గట్టిగా ఏడ్చేసింది సీత.

* * *

### మగాడు

ఆ పెంకుటింటి బైట—

వరండాలో కూర్చున్న ఓబులేశు బాధతో ఏడుస్తున్నాడు.

గుండెలమీద కుంపటిలా కూతురు పెళ్లీడు కొచ్చేసింది. ఆ బరువును దించుకోవాలంటే ఎన్ని సంబంధాలు చూసినా అందరూ "కట్నం..కట్నం" అంటూ గోల పెడుతూనే వున్నారు.

కట్నం డబ్బులు ఇవ్వలేని ఓబులేశు కూతురి పెళ్లి చెయ్యలేక ఏడవసాగాడు. 'అంత డబ్బు తనెక్కడ నుంచి తేగలడు...!'

అప్పుడే బయటికొచ్చిన సీతతో అదే మాటన్నాడు ఓబులేశు. తిరిగి అతనే అన్నాడు — "ఈ కట్నం కాదు కానీ, పిల్ల పెళ్లి చెయ్యలేక ఏదో ఓ రోజు ఉరేసుకుని చని పోతే బావుణ్నని పిస్తుంది నాకు."

సీత మాత్రం ఒక్క క్షణం అక్కడే ఆగి వెళ్లిపోతూ అంది-

"ఆరోజు అది తేలేదని నన్నేడిపించారు. ఈ రోజు మీ కూతురి కివ్వలేక మీరేడుస్తున్నారు."

—కందమూరి జనార్దన్